విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

జిల్లా ప్రజలకు కలెక్టర్ శుభాకాంక్షలు

విశాలాంధ్ర- రాజమహేంద్రవరం రూరల్ :దక్షిణ భారత దేశ ప్రాంతాలలో జరుపుకునే అతి పెద్ద పండగ సంక్రాంతి పండుగని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె. మాధవీలత శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పండుగ సందర్భంగా జిల్లా ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, సిబ్బందికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియ చేశారు. ప్రతి ఇంటి సిరులు కురిపించాలని, ఆరోగ్యం ఆనందాలు వేదజల్లాలని అభిలాష వ్యక్తం చేస్తూ కలెక్టర్ శుభాకాంక్షలు తెలియ చేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు కారణంగా ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమం జనవరి 15 వ తేదీ నిర్వహించడం లేదని ఆ ప్రకటనలో వెల్లడించారు.

సిమెంట్ రోడ్డును ప్రారంభించిన సర్పంచ్ ఊర్మిళాదేవి

విశాలాంధ్ర - ఉప్పలగుప్తం : ఉప్పలగుప్తం మండలం విలసవిల్లి గ్రామం గానుగు చెరువు వద్ద జగనన్న కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం రూ. 12 లక్షల నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి గ్రామ సర్పంచ్ సలాది ఊర్మిళదేవి కొబ్బరికాయ కొట్టి పనిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, కోలా యేసు, బళ్ళ సతీష్, ఉంగరాల నాగేశ్వర రావు, పెదపూడి రత్నం, కొల్లు లోకేష్, నవుండ్రు దుర్గారావు, గొలకోటి వీరబాబు, పుత్సల ఏసు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యలో ఘనంగా వివేకానంద 161వ జయంది

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ క్యాంపస్‌లో గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. మొదట జ్యోతి ప్రజ్వలనం గావించి స్వామి వివేకానంద చిత్రపటానికి క్యాంపస్ డైరెక్టర్, ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శ్రీనివాసరెడ్డి పూల మాల వేసి పుష్పాంజలి ఘటించారు. క్యాంపస్‌లోని వివిధ కళాశాలలలో ఆయా విభాగాల ప్రిన్సిపాల్స్ వివేకానంద చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ స్వామి వివేకానంద కొన్ని సంవత్సరాలు మాత్రమే జీవించి ఉన్నప్పటికీ యావత్ ప్రపంచంలో గల మానవజాతికి అమూల్యమైన భావజాలాన్ని అందించి చిరంజీవిగా అందరి హృదయాలలో నిలిచారని కొనియా డారు. ఈ కార్యక్రమంలో డీన్ అడ్మినిస్ట్రేషన్ ప్రొ వి. సత్యనారాయణ, గ్రంథాలయ శాఖ ప్రధాన అధికారి కె. అశోక్ కుమార్, పెదబ్రహ్మదేవం శ్రీ శారద రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్, గ్రంథాలయ సిబ్బంది సోమరాజు, రమ్య, గిడుతూరి వెంకటేష్ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఏ విజయభార్గవి, ఎంబిఏ విభాగం అధిపతి డాక్టర్ ఎం. గోవర్ధన్, ఫిజికల్ డైరెక్టర్ ఎం.ధర్మరాజు విద్యార్థులు పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలోని వాడపల్లి గ్రామంలోని స్వామివారి గోవింద స్వరాలతో మార్మోగిన చందన వెంకన్న క్షేత్రం. కోనసీమ తిరుమల తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన శ్రీ కలియుగ వెంకటేశ్వర స్వామి అలివేలు మంగ పద్మావతి సమేతంగా కొలువై ఉన్న వాడపల్లి క్షేత్రానికి వేలాదిగా భక్తులు తరలివస్తున్నారు. ఏడువారాల వెంకన్న దర్శనం ఏడేడు జన్మల పుణ్యఫలం అనే నానుడితో రాష్ట్ర నలుదిక్కుల నుండి భక్తులు తరలివచ్చి ఏడువారాల వెంకన్నను దర్శించుకున్న దివ్య ఆశీస్సులు పొందుతున్నారు. దూర ప్రాంతాల నుండి కాలినడక నుండి వచ్చే భక్తులు శుక్రవారం సాయంత్రానికి ఆలయానికి చేరుకుని ఆలయ ప్రకార మండపంలో సేద తీరుతున్నారు. శనివారం తెల్లవారుజామున గౌతమీ గోదావరిలో తల స్నానాలను ఆచరించి, మొక్కుబడులు చెల్లించుకునే భక్తులు తలనీలాలు స్వామి వారికి సమర్పించుకుని సంప్రదాయ వస్త్రధారణలతో స్వామివారి ఆలయ మాడవీధుల్లో ఏడు ప్రతిక్షణాలు నిర్వహిస్తూ గోవిందా గోవిందా హరి గోవిందా, అనే నామస్వారాలతో ఆలయమంతా మారుమోగింది. స్వామివారి ఆలయ సన్నిధిలో ఐశ్వర్యలక్ష్మీ హెరీమం అర్చకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి సుప్రభాత సేవ మేలుకొలుపు సేవ, స్వామివారి పుష్పాలంకరణ అనంతరం స్వామివారి మొదటి హారతితో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఏడువారాల నోము నోసుకొనే భక్తులు చందన వెంకటేశ్వర స్వామిని నిలువెత్తు స్వరూపాన్ని దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శనివారం ఒక రోజే ప్రత్యేక దర్శనం ద్వారా రూ.14,39,820, అన్న దాన ప్రసాదం ద్వారా స్వామి సేవా రూ,.3,71,992, లడ్డు విక్రయం ద్వారా రూ.4,28,475, ఆన్లైన్ ద్వారా రూ.1,15,880, భక్తుల విరాళం ద్వారా రూ.28,648, సేవలు వల్ల ఆదాయం రూ.82,250 మొత్తం రూ.24,67,065 వచ్చినదని ఆలయ కార్య నిర్వహణ అధికారి ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. ఆలయ వద్ద శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా ఆత్రేయపురం ఎస్సై బి. కిరణ్ కుమార్ తన సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు.

దుస్తుల పంపిణీ

విశాలాంధ్ర-దేవరపల్లి : దేవరపల్లి మండలం ఎర్నగూడెం శ్రీ లక్ష్మీనరసింహ ఇండస్ట్రీస్ పనిచేస్తున్న కార్మికులకు సమస్త యం డి శ్రీకాకుళ పూ కాశీ విశ్వనాథం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని దుస్తులు, స్వీట్లు అందించనున్నట్టు కాశీ విశ్వనాథం తెలిపారు. 2008 నుంచి ప్రతి సంక్రాంతికి ఫ్యాక్టరీలో వర్కర్స్ కు సుమారు 200 మందికి ప్రతి ఏడాది సంక్రాంతి పురస్కరించుకుని దుస్తులు, స్వీట్లు అందించడం జరుగుతుందని కాశీ విశ్వనాథం తెలిపారు ఈ కార్యక్రమంలో నూలు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-కొవ్వూరు :కొవ్వూరు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు జనసేన పార్టీ ఇంచార్జ్ టీవీ రామారావు రావు ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు కొవ్వూరు టౌన్ లోని 19వ వార్డు నందు ఇందిరమ్మ కాలనీలో నిర్వహించారు. కొవ్వూరు నియోజకవర్గంలో మహిళలు జనసేన పార్టీ వీర మహిళలు మరియు తెలుగుదేశం పార్టీ మహిళలు పాల్గొనడం జరిగింది. చిన్నపిల్లలకు భోగి పళ్ళు పోసి చిన్నపిల్లలను దీవించారు అనంతరం భోగిమంట వెలిగించి అందరికీ భోగి మరియు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ కొవ్వూరు టౌన్ అధ్యక్షులు దేగల రాము, కొవ్వూరు పట్టణ మహిళా అధ్యక్షురాలు కే నవ్య, కొవ్వూరు మండల యువత అధ్యక్షులు గంగుమళ్ల స్వామి, పశ్చిమగోదావరి జిల్లా ప్రోగ్రామ్ కమిటీ మెంబర్ తేజస్, అచ్యుతు రాయుడు, జనసైనికులు వీర మహిళలు భారీ స్థాయిలో ముగ్గుల పోటీలో పాల్గొన్నారు.

కుంతీదేవి మహోత్సవం

విశాలాంధ్ర-దేవరపల్లి: తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం పల్లంట్ల గ్రామంలో కుంతీదేవి మహోత్సవంలో ఊరేగి మహోత్సవంలో భాగంగా శనివారం రంగ రంగ వైభవంగా బాణ సంచాలతో, బ్యాండ్ మేళాలతో గ్రామంలో పురవీధులమీదుగా అత్యంత వైభవంగా ఊరేగింపు జరిగింది. అనంతరం కుంతీదేవి నిమజ్జనం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచి భక్తులు పూజా కార్యక్రమం నిర్వహించి అనంతరం గ్రామంలో కుంతీదేవి నందీశ్వరుడ ఊరేగింపు నిర్వహించారు ఆలయ కమిటీ సభ్యులు అక్క బత్తుల వెంకటరమణ మెట్పల్లి వెంకటేశులు చింతాల హరియా మందపాటి దశరథుడు నూతలపాటి రమేష్ బొందల ఏసు చింతల దాసు ఆలయ కమిటీ సభ్యులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సంక్రాంతి బరిలో గెలిచేది కోడా.. పోలీసా?

విశాలాంధ్ర-కొవ్వూరు : సంక్రాంతి సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాలలో కోడి పందాలు, గుండాటలు నిర్వహించడం ఏటా షరా మామూలుగా నడుస్తోంది. సంక్రాంతికి మూడు రోజులు ముందే పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తూ కోడిపందాలు ఆడితే కఠిన చర్యలు అంటూ బిల్డప్ ఇస్తున్నారు. కానీ భోగి రోజు నుంచి మూడు రోజులు పాటు పందెం రాయుళు నిర్విరామంగా పందేలు నిర్వహిస్తున్నా ఆ చుట్టుపక్కల కూడా పోలీసులు కనిపించరు. ఎందుకంటే ఏ పార్టీ అధికారంలో ఉన్నా ప్రజా ప్రతినిధులు హుకుం జారీ చేసి పోలీసుల చేతికి అడ్డుకట్ట వేస్తున్నారు. సాక్షాత్తు హైకోర్టు కోడిపందాలు జుదాలు నిర్వహించకూడదని పదేపదే తీర్పులు ఇచ్చి నిర్ణయం తీసుకుం టున్నా అవేమీ ప్రభుత్వానికి పోలీసులకు పట్టడం లేదు.. ఆ ఏముందిలే పోలీసులు ప్రతి ఏడాది సంక్రాంతి ముందు హెచ్చరికలు జారీ చేయడం మామూలే.. ఆ మూడు రోజులు పందెం రాయుళ్ల హవా నడవటం మామూలే అని కోడి పందాలు ఆడేవారు గుండాట ఆడేవారు ఆయా నిర్వహణశిబిరాల వద్దకు వచ్చి తమ చేతి దురద తీర్చుకోవటం ఆ అవకాశాన్ని నిర్వాహ కులు అందిపుచ్చుకొని లక్షలు సంపాదించడం వెను తిరగడం ఆనవాయితీగా మారింది. ఈ నేపద్యంలో ఎవరు బకరా అనేది ఇట్టే తెలుస్తోంది.

డంపింగ్ యార్డుగా షాదీఖాన

- పట్టించుకునే నాథుడు కరవు

విశాలాంధ్ర - మండపేట : వైసీపీ ప్రభుత్వంలో సీఎం జగన్ ముస్లింలకు ఒరగబెట్టిందేమీ లేదని టీడీపీ ముస్లిం మైనారిటీ సంఘాల నాయకులు సల్మాన్ హుస్సేన్, షేక్ ఇబ్రహీం అన్నారు. పట్టణంలోని రైతు బజార్ సమీపాన గత ప్రభుత్వంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ముస్లింల చిరకాల కోరికైన షాదీఖాన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అప్పట్లో దాన్ని శరవేగంగా పూర్తి చేసి ముస్లింలకు త్వరితగతిన అప్పగించాలనే సంకల్పంతో నిర్మాణ పనులు వేగవంతం చేశారు. ఎర్త్ వర్క్ దగ్గర నుంచి శ్లాబ్ నిర్మాణం కూడా పూర్తయింది ఈ లోగా ఎన్నికలు రావడంతో అపనులకు బ్రేకులు పడ్డాయని వారన్నారు. దరిమిలా వైసీపీ ప్రభుత్వం వచ్చాక అసంపూర్తిగా ఉన్న షాదీఖాన పనులను పూర్తి చేయించి అప్పగిస్తామని వైసీపీ నాయకులు మాట ఇచ్చి నేటికి ఐదేళ్ళు పూర్తైందన్నారు. నేటికీ షాదీఖాన నిర్మాణం గానీ దాని మంచి చెడ్డలు గానీ పట్టించుకునే వారు లేకుండా పోయారని విమర్శించారు దీంతో తాము ఎంతో పవిత్రంగా భావించే షాదీఖాన డంపింగ్ యార్డు మాదిరిగా తయారైందన్నారు. అందులో పండుగ సమయాల్లో ఖురాన్ గ్రంథాన్ని ఉంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించుకుంటూ దేవాలయంగా చూసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆ భవనం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందన్నారు. అందులో ఒకటేమిటి అన్ని రకాల పనులకు వాడుకుంటూ అపవిత్రం చేసి పారేశారని ఆవేదన వ్యక్తం చేశారు. చెత్త చెదారాలు, మద్యం సీసాలు, పనికిరాని దుస్తులు ఇలా అన్నింటితో దర్శనమిస్తున్నదన్నారు. కౌన్సిల్లో షాదీఖాన అభివృద్ధికి రూ.40 లక్షలు కేటాయించానని చెప్పిన మాటలు కేవలం ప్రకటనలకు మాత్రమే పరిమితం అయ్యాయని ఆరోపించారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు ఎండీ అతాపూర్ రెహ్మాన్, ఎండీ కరీం, షేక్ వల్లీజానీ ఉన్నారు.

బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థిగా చిత్రసేన్

విశాలాంధ్ర-పెరవలి : రానున్న ఎన్నికల్లో బహుజన సమాజ్ పార్టీ తరఫున నిడదవోలు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా గుమ్మాపు చిత్రసేన్ పోటీ చేయనున్నట్లు చిత్రసేన్ తెలిపారు. శనివారం పెరవలి బీఎస్పీ కార్యాలయంలో జరిగిన బియస్పీ జిల్లా, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఈనిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు.ప్రస్తుతం బీఎస్పీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కో ఆర్డినేటర్గా ఉన్న చిత్రసేను ఎన్నో ఏళ్లుగా బీఎస్పీకి అనేక సేవలు అందిస్తున్నారని, ప్రజల సమస్యలపై పోరాటం చేస్తున్నారని పలువురు బీఎస్పీ నాయకులు అన్నారు.ఈసందర్భంగా చిత్రసేను మాట్లాడుతూ తనని నమ్మి తనకి ఇటువంటి సువర్ణ అవకాశం కల్పించిన బియస్పీజాతీయ, రాష్ట్ర నాయకత్వానికి మరియు నిడదవోలు నియోజకవర్గ నాయకులకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేసారు. నిడదవోలు నియోజకవర్గంలో బియస్పీని గెలిపించడం కోసం అహర్నిశలు శ్రమిస్తానని, నియోజకవర్గ ప్రజల సమస్య లపై గలమెత్తడంలో రెట్టింపు ఉత్సాహం తో ముందు సాగుతానని ఆయన అన్నారు.ఈసమావేశంలో బియస్పీజిల్లా అధ్యక్షులు పట్నాల విజయ్ కుమార్, ఏలూరి అశోక్ కుమార్, నల్లి రమేష్, సత్యనారాయణ, బయ్యే మునేంద్ర, బద్దా జాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కావమ్మ పేరంటాలు ఉత్సవాలు

విశాలాంధ్ర - సామర్లకోట : భోగి సంక్రాంతి కనుమ పండుగలను పురస్కరించుకుని సామర్లకోటలో శ్రీ కావమ్మ పేరంటాల ఉత్సవాలను మూడు రోజులు ఘనంగా నిర్వహిస్తారు. కావమ్మ పేరంటాలు కథలోకి వెళితే సావిత్రి అరుంధతి మొదలగు పుణ్యమూర్తులతో సరితూగిన మహాసాధ్వి శ్రీ కామ పేరంటాలుగా చెప్పుకుంటారు, సామర్లకోటలోని బెస్తా కులానికి చెందిన లక్ష్మయ్య వెంకయ్యమ్మ దంపతులకు కావమ్మ జన్మించింది. మారైన పెళ్లి చేసుకున్నగా ఆరు నెలల తరువాత మద్రాసు దొరల వద్ద బోయలందరిలో పెద్ద బోయగా నెలకు ఆరు వరహాలకు జీతానికి చేరాడని కాలం గడిచి ఆరు సంవత్సరాల తర్వాత ముఖ్యంగా తన భార్యను చూడాలనిపించి మద్రాసు సెలవు తీసుకుని ఓడరేవుకి చేరుకొనగా ఓడ బయలుదేరిపోవడంతో మద్రాసు నుండి సామర్ల కోటకు నడిచి బయలుదేరడంతో మార్గం మధ్యలో భరించరాని కడుపు నొప్పితో సామర్లకోటకు చేరి మరణించెను. విషయం తెలిసిన కావమ్మ సతీసహగమనానికై దొరలను అనుమతి కోరగా అనుమతి నిరా కరించగా దొరల కలలోకి వెళ్లి కనిపించడంతో సతీసహగమనానికి ఒప్పుకున్నారని వేలాది ప్రజల సమక్షంలో సతీసహగము కావించడంతో అనంతరం అక్కడే ఆలయాన్ని నిర్మించి కామ ఉత్సవాన్ని జరిపిస్తున్నారు. కుటుంబ సభ్యులు సుఖపట్ల వంశీయులు శ్రీ కావమ్మ పేరంటాల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు.

మత్తు పదార్థాలను అరికట్టాలి

విశాలాంధ్ర-దేవరపల్లి: మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలను అరికట్టాలని డివైఎఫ్ఐ సిఐటియు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించడం అభినందనీయమని త్యాగంపూడి గ్రామ ఉపసర్పంచ కుసులూరి వెంకట సతీష్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్లో డివైఎఫ్ఐ సిఐటియు ఆధ్వర్యంలో 9వ సంక్రాంతి సంబరాలను ఆయన ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా క్రీడలు నిర్వహించడం ద్వారా యువత చెడు మార్గాల వైపు వెళ్ళకుండా నిరోధించవచ్చు అన్నారు. కోడిపందాలు, జూదాలను యువత వ్యతిరేకించాలని కోరారు. డివైఎఫ్ఐ జిల్లా నాయకులు గారపాటి ప్రసన్న కృష్ణ మాట్లాడుతూ మద్యం మత్తుమందుల ప్రభావం యువతపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని వాటిని అరికట్టాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ గ్రామ కమిటీ అధ్యక్షులు గట్టం నాని కార్యదర్శి కొత్తపల్లి తాతారావు డివైఎఫ్ఐ నాయకులు పరపతి సోమశేఖర్ మెరిపే సతీష్ గట్టెం కృష్ణమోహన్ సిద్దంశెట్టి శీను క్రీడాకారులు మరియు సిఐటియు మండల కార్యదర్శి ఎస్ భగత్ భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంతూర్ రంగవల్లులు

విశాలాంధ్ర - రాజోలు : విప్రో ఎంటర్ ప్రైజెస్ సంతూర్ ఆధ్వర్యంలో రాజోలు పాత ఆంధ్రబ్యాంకు వీధిలో ఏర్పాటు చేసిన రంగవల్లుల పోటీలు అందరినీ అలరించాయి. రాజోలు ఎంఈఓ 2 తాడి ప్రసాద్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని ముగ్గుల పోటీలను ప్రారంభించారు. సుమారు 34 మంది ఈపోటీల్లో పాల్గొని రకరకాల అందమైన ఆకృతి గల రంగు, రంగుల ముగ్గులు వేసి అలరించారు. ఈపోటీల్లో విజేతలకు మొదటి బహుమతిగా ట్రావెల్ బ్యాగ్, రెండవ బహుమతి డిన్నర్ సెట్, మూడవ బహుమతిగా హాట్ బాక్స్ ఎంఈఓ ప్రసాద్ రావు చేతులు మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో సంతూర్ డిస్టిబ్యూటర్ పద్మనాభ స్వామి, న్యాయ నిర్ణేతలు రమణ, విజయ కిషోర్, బోళ్ళ పద్మ, స్థానిక నాయకులు ఆడబాల సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కియా నుంచి అధునాతన కాంపాక్ట్ ఎస్యూ

విశాలాంధ్ర-రాజమండ్రి : భారతదేశపు అగ్రగామి ప్రీమియం కార్మేకర్ కియా, దాని అత్యంత ప్రీమియం కాంపాక్ట్ ఎస్యూ న్యూ సోనెట్ను దేశవ్యాప్తంగా 7.99 లక్షల (ఎక్స్-షోరూమ్) నుండి ప్రారంభమయ్యే ప్రత్యేక ప్రారంభ ధరతో పరిచయం చేసినట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా కియా ఇండియా చీఫ్ సేల్స్ అండ్ బిజినెస్ స్ట్రాటజీ ఆఫీసర్ మిస్టర్. మ్యూంగ్ "సిక్ సోహ్న మాట్లాడుతూ, 'మేము మరోసారి కాంపాక్ట్ ఎస్యూ సెగ్మెంట్ను కొత్త సోనెట్ను పరిచయం చేయడం ద్వారా ప్రీమియమ్ చేస్తున్నామన్నారు.ఇందులో 10 స్వయం ప్రతిపత్త ఫీచర్లతో అత్యుత్తమ అడాస్ బలమైన 15 హై-సేఫ్టీ ఫీచర్లు ఉన్నాయనీ, ఈ వాహనం 70కి పైగా కనెక్ట్ చేయబడిన కార్ ఫీచర్లను కలిగి ఉందన్నారు. డిసెంబర్ 2023లో ఆవిష్కరించబడింది, యొక్క రెండవ అత్యధికంగా అమ్ముడైన ఆవిష్కరణ యొక్క ఈ తాజా పునరావృతం 25 భద్రతా లక్షణాలను కలిగి ఉందని వివరించారు. సెగ్మెంట్ లో అత్యంత కనెక్ట్ చేయబడిన కారుగా గర్వంగా నిలుస్తుంది, ఆనందించే హింగ్లీష్ కమాండ్లు, సరౌండ్ వ్యూ మానిటర్ వంటి ఫ్యూచరిస్టిక్ ఫీచర్లను కలిగి, ఉత్తమమైన కాంపాక్ట్ ఎస్యూ డ్రైవింగ్ అనుభవాన్ని అందించడానికి రూపొందించబడ్డాయన్నారు.

స్నేహితుడి కుటుంబానికి రూ.1.20 లక్షల సాయం

విశాలాంధ్ర - పెద్దాపురం : ఎక్కడో పుట్టి...ఎక్కడో పెరిగి ఇక్కడే కలిసాము. చదువులమ్మ తల్లి చెట్టు నీడలో...అంటూ సరదాగా గడిపిన స్నేహితులు..ఏడాదికి ఓ సారి కలుద్దామని ఎవరూ ఏ కష్టంలో ఉన్న అందరం అండగా నిలువాలి అనే ప్రధాన అజెండాను అమలు చేశారు. తమలో ఓ స్నేహితుడి అమరజీవి అయితే ఆ కుటుంబ సభ్యులకు అండగా నిలిచారు. తమ వంతు ఉడతా సాయంగా స్నేహితుడు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతే మేమంతా ఆ సమయానికి రాలేక పోయినా మా వంతుగా ఆ కుటుంబాన్ని ఆదుకోవాలన్న ప్రధాన ఉద్దేశ్యం ఆ కుటుంబానికి అండగా నిలిచి స్నేహానికి ఊపిరి ఉందని నిరూపించారు. పెద్దాపురం మండలం చంద్రమాంపల్లి 1997-98 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు. జిల్లా పరిషత్ హైస్కూల్ పూర్వ విద్యార్థి తాటిపర్తి గ్రామానికి చెందిన గౌతు వల్లయ్య ఇటీవల పిఠాపురం మండలం విరవాడ వద్ద అయ్యప్ప స్వామి మాలధారణ చేపట్టి తిరిగి వస్తూ ట్రాక్టర్ ఢీ కొని రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మిత్రులందరూ ఎక్కడో ఎక్కడో ఉన్నందున వల్లయ్య అంత్యక్రియలకు అందరూ హాజరు కాలేక తమ వంతు సాయంగా ఆ కుటుంబానికి అండగా నిలవాలని ప్రతీ పూర్వ విద్యార్థి చేయి చేయి కలిపి సుమారు లక్షా 20 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని భార్య నాగలక్ష్మి, కుమారుడు వీరేంద్ర సాయి, కుమార్తె చంద్ర శిరీషకు అందజేశారు. పార్టీల పేరుతో స్నేహితులు చేస్తున్న హడావుడి కంటే ఆపద వచ్చిన వెంటనే స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచి పదవ తరగతి పూర్వ విద్యార్థుల చేసిన సేవను పలువురు అభినందించారు.

కోనసీమ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అల్లాడ

విశాలాంధ్ర - అమలాపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులుగా అల్లాడ శరత్ బాబు నియమితు లయ్యారు. గౌరవ అధ్యక్షులుగా ఎమ్మెల్సీ కుడుపూడి సూర్య నారాయణ రావు బాధ్యతలు నిర్వహిస్తారు. కోనసీమ షటిల్ అసోసియేషన్‌లో కీలక భూమిక పోషించే అల్లాడ శరత్ బాబు ఉన్నతమైన పదవి అలంకరించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

హెల్పింగ్ హాండ్స్‌కు రమణారావు ఆర్థిక సాయం

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం ఫ్రెండ్స్ ఫరెవర్ హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థకు అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సిపి సీనియర్ నాయకుడు గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు ఆర్థిక సాయం అందించారు. పి గన్నవరం నియోజకవర్గం తొండవరంలో శుక్రవారం జరిగిన ఫ్రెండ్స్ ఫరెవర్ హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సంస్థ వార్షికోత్సవ సభలో రమణారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమణారావు కేక్ కట్ చేసి హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సేవ చేస్తున్న సేవలను కొనియాడారు. అలాగే స్వచ్ఛంద సేవా సంస్థకు అండగా సంస్థ నిర్వాహకులు నాగాబత్తుల జాన్‌కు రూ.15 వేలు చెక్కును రమణారావు అందజేశారు. కార్యక్రమంలో గుడ్ సీడ్ ఫౌండేషన్ సభ్యులు నేరేడుమిల్లి శ్రీను, గంటా లక్ష్మీ ప్రసాద్, పరమట రాజేష్, రాంబాబు, భీమేష్, జాను, రాజమోహన్, కుంచే అర్జున్, నూక పెయ్యి మనోజ్, కొంకి మనోజ్, మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ

విశాలాంధ్ర - సామర్లకోట : అసాంఘిక కార్యకలాపాలకు ఎటువంటి అనుమతులు లేవని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ వివరించారు. కాకినాడ జిల్లా సామర్లకోట పోలీస్ స్టేషన్‌లో నూతనంగా నిర్మించిన సీఐ క్యాబిన్ ప్రాంగణాన్ని ఆయన ప్రారంభించారు. పెద్దాపురం డీఎస్పీ లతా కుమారి, సామర్లకోట సిఐ సురేష్, సామర్లకోట స్టేషన్ ఎస్ఐలు మౌనిక, మూర్తి తదితరులు పాల్గొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని ఎస్పీ కోరారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

విశాలాంధ్ర - తాళ్ళపూడి : ప్రభుత్వం తమ పట్ల మొండి వైఖరి ని అవలంభించడం దారుణమని తాళ్ళపూడి మండల అంగన్వాడీలు, ఆయాలు పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో జగనన్న తమ పార్టీ అధికారం లోకి వస్తే తెలంగాణ లో కంటే ఎక్కువ వేతనం ఇస్తామని చెప్పారని, అధికారం లోకి రాగానే పెంచిన 1000 జీతం తప్ప ఒక్క రూపాయి కూడా పెంచలేదని, మాట తప్పిన ప్రభుత్వం నెల రోజుల నుండి సమ్మె చేస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. శనివారం ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో సమ్మెను కొనసాగించారు.

స్కిల్ గేమ్స్, పందాలకు సిద్ధంగా నిర్వాహకులు

యధావిధిగా పోలీసుల హెచ్చరికలు

విశాలాంధ్ర - అనపర్తి : ప్రతి ఏడాది సంక్రాంతి ముందు జూదం, గుండాట, పేకాట, స్కిల్ గేమ్, కోడి పందాలు నిషేధమని ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. పోలీస్ హెచ్చరికలు పక్కనపెట్టి యధావిధిగా కార్యక్రమాలన్నీ కొనసాగడం ఎప్పుడు సర్వసాధారణమే. దీనికి ఉదాహరణ ఈ ఏడాది జరిగే అనపర్తి, కుతుకులూరులో జరిగే తీర్థ మహోత్సవాలు పురస్కరించుకొని జోరుగా కోడి పందాలు, స్కిల్ గేమ్ నిర్వహణకు పెద్ద ఎత్తున సన్నాహాలు జరుగుతున్నాయి. భోగి రోజు నుండి ముక్కనుమ వరకు నిర్వహించే స్కిల్ గేమ్, కోడిపందాలకు నిర్వాహకులు శనివారం పాట నిర్వహించగా కుతుకులూరులో సుమారు రూ. 26 లక్షలకు పాడుకోవడం జరిగిందని గ్రామస్తులు చెబుతున్నారు. దీనిని బట్టి ఎన్ని లక్షలు స్కిల్ గేము, కోడి పందాల్లో చేతులు మారుతున్నాయో అర్థం చేసుకోవచ్చున్నది పలువురి వాదన. ఈసారైనా పోలీసులు హెచ్చరికలు పనిచేస్తాయా? ఎప్పటిలానే జూదం, స్కిల్ గేమ్స్, గుండాట, కోడిపందాల నిర్వాహకులదే పై మాటా? చూడాలని అందరూ ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు.

జామికి వినూత్న పురస్కారం

విశాలాంధ్ర - తాళ్ళపూడి : రాజమహేంద్రవరంలో మూడు రోజుల పాటు ఘనంగా జరిగిన రెండవ ప్రపంచ తెలుగు మహాసభలలో తెలుగు ఉపాధ్యాయుడు జామి సత్యనారాయణ సన్మానం అందుకున్నారు. సుమారు 5 దేశాల నుండి పండితులు, కవులు, నటులు తెలుగు భాషాభిమానులు విచ్చేసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తాళ్లపూడి మండలం పెద్దేవం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు జామి సత్యనారాయణ చేసిన కవితా ఆలాపన అందర్ని ఆకట్టుకున్నాయి. నాగాలాండ్ గవర్నర్ శ్రీ గణేషన్ చేతుల మీదుగా అభినందన పురస్కారం అందు కున్నారు. తాళ్లపూడి మండలానికి పేరు తీసుకొచ్చిన తెలుగు ఉపాధ్యాయుడు జామి సత్యనారాయణను ఉపాధ్యాయులు విద్యార్థులు తెలుగు భాషాభిమానులు అందరూ అభినందనల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా రెండవ ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహకులైన ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షులు, గిన్నిస్ బుక్ రికార్డు ధీరులు శ్రీ గజల్ శ్రీనివాస్, చైతన్య విద్యాసంస్థల అధినేత సత్యనారాయణ రాజు జామిని ఘనంగా సన్మానించారు.

ఒంటి కాలిపై అంగన్వాడీల నిరసన

విశాలాంధ్ర-పెరవలి : అంగన్వాడీల సమ్మె శనివారం నాటికి 33వ రోజుకు చేరింది. ఈసందర్భంగా పెరవలి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఒంటి కాలిపై నిలబడి అంగన్వాడీలు నిరసన తెలిపారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని అన్నారు. ఈకార్యక్రమంలో మండలంలోని అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

ముద్రగడను కలిసిన రామారావు

విశాలాంధ్ర-కొవ్వూరు : కిర్లంపూడిలో మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభాన్ని కొవ్వూరు మాజీ ఎమ్మెలే, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి టి.వి. రామారావు కలిశారు. తాను ఆయన అభిమానినని, మర్యాదపూర్వకంగా కలిసేందుకు వచ్చానని రామారావు తెలిపారు. ముద్రగడ వంటి నాయకుడు జనసేనలోకి రావాలని తాను కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ జనసేన అధ్యక్షులుదేగల రాము, కల్లేపల్లి ప్రభాత్, గంగుమల్ల స్వామి,పోలిశెట్టి శివ,పుట్టి రమేష్, జన సైనికులు పాల్గొన్నారు.

గోదావరి జోనల్ బాడీ బిల్డింగ్, బెస్ట్ ఫిజిక్ ఛాంపియన్‌షిప్‌లో ఆదిత్య విద్యార్థికి గోల్డ్‌మెడల్

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం జనవరి 12, 2024న యూత్ డే సందర్భంగా కోనసీమ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రెండవ గోదావరి జోనల్ బాడీ బిల్డింగ్, బెస్ట్ ఫిజిక్ ఛాంపియన్ షిప్-2024లో ఆదిత్య కళాశాలలో సివిల్ విభాగంలో ఫైనల్ ఇయర్ చదువుతున్న ఎన్. రోహిత్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్‌ను సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఛాంపియన్ రోహిత్‌కు ఆదిత్య విద్యా సంస్థల వైస్ చైర్మన్ డా నల్లమిల్లి సతీష్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి, కోచ్ డి. సాయి కిషోర్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్‌లో మరింత ప్రతిభ కనబరిచి అత్యున్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.